**శ్రీ రమణ జ్యోతి** — **Sri Ramana Jyothi**

డిసెంబర్ 2019 — December 2019

ఈ సంచికలో ... IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 65వ ప్రవచనం** | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| **2.** | **శరణాగతి - అంతరార్థం** | తాడిమేటి సత్యనారాయణ | 10 |
| **3.** | **అమరత్వ చేతన** | డా॥ తోట శ్రీనివాస్ | 15 |
| **4.** | **శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు** | కాట్రావులపల్లి సుబ్బలక్ష్మి | 22 |
| **5.** | **శ్రీ భగవాన్ సేవలో** | జి. శ్రీహరిరావు | 27 |
| 6. | We Must Let Ourselves be Possessed by God | Dr.K. Subrahmanian | 30 |
| 7. | Kavyakantha's Chatvarimsat | V. Krithivasan | 36 |
| 8. | Lest We Forget - G. Narayana Swami | Sri Panduranga Rao | 39 |
| 9. | Saints of Periapuranam Manakkanjara Nayanar | | 42 |
| 10. | King Janaka | | 46 |
| 11. | My Lord - by Sant Kabir | | 49 |
| 12. | The Mark Of A True Devotee | | 50 |


**Events in Sri Ramana Kendram in December**

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 10th December - Karthigai Deepam - 6.00 p.m.
4. 14th December (Every 2nd Saturday of the month) Uma Sahasram recitation from 12.00 noon - 5.00 p.m.
4. 14th December - Punarvasu Satsang - 6.00 - 7.30 p.m.

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# ఆలోచనలు బహిర్గతం కావాలి

డా॥ కే.యస్. గారి 65వ ప్రవచనం

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

## తొలిరోజుల్లో ఆశ్రమం

మనం ఈ రోజుల్లో చూసే రమణాశ్రమం కంటే భగవాన్ వున్న రోజుల్లో ఆశ్రమం చాలా భిన్నంగా వుండేది. భగవాన్ జీవించి వున్న కాలంలో మొత్తం చాలా పొదుపుగా వుండేది. అప్పుడు ఒకే సందర్శకుల హాల్ వంటిది వుండేది. భక్తులు ఎవరూ మూడు రోజుల కంటే ఎక్కువ కాలం వుండే అవకాశం లేదు. ఆ విషయంలో సర్వాధికారి చాలా ఖచ్చితంగా వుండేవారు. ఒకటే పెద్ద స్నానాల గది. స్త్రీలు ఆశ్రమంలో వుండడానికి వీలుండేది కాదు. బయట స్నేహితుల ఇళ్ళలోనో, లేదా ఊళ్ళోనో వుండవలసి వచ్చేది. విశ్రాంతి హాలులో పడుకునేందుకు చాపలు, తలగడగా వాడుకునేందుకు కొన్ని చెక్క పలకలు మాత్రం వుండేవి. అదే ఈ రోజుల్లో కాటేజీలు, చక్కని గదులు, పడకలు మొదలైన సౌకర్యాలు వున్నాయి.

ఇక భగవాన్ దినచర్య ఎప్పుడూ ఒకలాగానే వుండేది. రోజులో చాలా కాలం పాటు మహర్షి మౌనంగా వుండేవారు. అప్పుడప్పుడు భక్తుల వైపు చూస్తూ వుండవచ్చు. లేదా తమ కళ్ళకు సూటిగా ఎక్కడో అనంతంలోనికి చూస్తుండేవారు. ప్రతిరోజూ వచ్చిన వార్తాపత్రికలను వారి ముందు వుంచేవారు. వాటిని కొంతసేపు చదివేవారు. భగవాన్ హాలులో వార్తాపత్రికలు చూస్తున్నప్పుడు నాకు కొన్నిసార్లు ఆయనకు వార్తాపత్రికలు చదవాల్సిన అవసరం

ఏముంది? దేశంలోనూ, ప్రపంచంలోనూ జరిగే విషయాలను క్రొత్తగా తెలుసుకునే అవసరం ఏముంది? ఆయనకు తెలియనిది ఏముంది, అని అనిపించేది. కొన్ని ఏళ్ళ తరువాత గాని నాకు ఈ విషయం అర్థం కాలేదు.

**మనలో ఒకరు**

తాము మనందరికంటే భిన్నమైన వారన్న అభిప్రాయాన్ని మనలో కలిగించడం ఆయనకు ఇష్టం లేదు. మనం నిత్యజీవితంలో నిర్వర్తించేవే తాము చేస్తున్న అభిప్రాయాన్ని కలిగించడమే వారి ఉద్దేశం. చాలాసేపు సోఫాపై కాళ్ళు జాపి కూర్చునేవారు. అప్పుడప్పుడు కూర్చునే భంగిమను మార్చేవారు. కొన్ని సమయాల్లో తల కొద్దిగా వణుకుతుండేది. లేదా పక్కకు వాలి వుండేది. నిటారుగా కూర్చున్నప్పుడు ఒక విగ్రహాన్ని చూస్తున్నట్లు అనిపించేది. అలాంటప్పుడు చలనం లేకుండా భూమి మీదికి శివుడు దిగివచ్చినట్లుగా అనిపించేది. స్వయంగా ఆయన శివుడేనన్న భావన కలిగేది. ఆ రోజుల్లో వార్తాపత్రికలు మద్రాసునుండి ఒక పై కవరులో వుంచబడి వచ్చేవి. తాము చదివిన తరువాత పత్రికలను శుభ్రంగా మడిచి తిరిగి ఆ కవర్లలో వుంచి ఆశ్రమ ఆఫీసుకు పంపేవారు.

మధ్యాహ్నము, రాత్రి భోజనానికి ముందు మహర్షి ఒక రెండు నిమిషాలపాటు బయట కొద్దిగా నడిచి వచ్చేవారు. గోశాలకు వెళ్ళి కాస్త ఆగి తిరిగి వచ్చేవారు. మహర్షి ఎప్పుడూ, ఏ కాలంలో నైనప్పటికి పాదరక్షలు ధరించేవారు కాదు. వెంట వెళ్ళే పరిచారకులు ఇతరులు మాత్రం చెప్పులు తొడుక్కునేవారు. తిరువణ్ణామలైలో



వేసవి చాలా తీవ్రంగా వుంటుంది. బండల మీద పాదరక్షలు లేకుండా నడవడం అసాధ్యం. తమకు పాదరక్షలు లేనప్పటికీ, నెమ్మదిగా నడుస్తూ, వెంట వచ్చేవారికి మీరెందుకు ఎండలో బాధపడతారు, తొందరగా నడచి వెళ్ళండని అనేవారు. హాలులో వున్నంతకాలం భగవాన్ పాదాలనుతాకే ధైర్యం ఎవరూ చేసేవారు కాదు. కాని వారు బయట నడుస్తున్నప్పుడు అప్పుడప్పుడు భక్తులు వారి పాదాలకు నమస్కరించేవారు. కొన్ని సమయాల్లో పాదాలను విడువక ఏడుస్తున్నప్పుడు వారిని ఎంతో కృపతో చూస్తూ ఇక చాలు, అంటూ ముందుకు సాగేవారు.

మహర్షి సోఫా నుండి లేచే ముందు, కాళ్ళు పూర్తిగా జాపి దగ్గరలో వుంచిన సీసాల నుండి ఏదో ఒక తైలాన్ని తీసుకుని కాళ్ళు, ముఖ్యంగా మోకాళ్ళకు రుద్దుకునేవారు. అలాంటప్పుడు హాలులోని భక్తులను చూస్తుంటే, మీకే కాదు, నాకూ కష్టాలున్నాయి అన్నట్లు మాకు అనిపించేది. అలాంటి సమయాల్లో, శరీర స్పృహ లేదన్న పరిస్థితుల్లో ఎందుకు అలా చేయాలని, అసలు ఏ బాధలూ లేకుండ చేసుకొనగల సామర్థ్యం వున్నప్పుడు ఆయన అలాగ ఎందుకు చేస్తున్నారనీ నాకు అనిపించేది. తాము సామాన్యుడినన్న అభిప్రాయం అందరిలో కల్పించడానికి అలా చేసేవారా? ఒకసారి ఎవరో ఒక స్వామీజీ అన్ని రోగాలను నయం చేస్తున్నారని అన్నప్పుడు, ఓహో! చాలా మంచిది. వచ్చినవారు నన్ను చూసి, ఈ స్వామి తన జబ్బునే బాగు చేసుకోలేకున్నారు, ఇక మా బాధల నేమి పోగొడతారని వెళ్ళిపోతారు. మనకే మంచిది అనే వారు. తరువాతి కాలంలో, నొప్పులు ఎక్కువైనప్పుడు మహర్షి నడక

చూడడానికే బాధాకరంగా వుండేది. అలాంటి సమయాల్లో నన్ను చూసి చిరునవ్వు నవ్విన సందర్భాలు కూడా వున్నాయి. ఇలా వుందేమిటి అని అనుకొంటున్నావా, అది అంతే, అన్నట్లుండేది ఆ నవ్వు.

## దాగిన ఆలోచనలు బయటపడాలి

మనం శ్రీరామకృష్ణ పరమహంస జీవిత చరిత్రను చదివినప్పుడు, ఆయనకు క్యాన్సర్ ఎందుకు వచ్చింది, అలాగే శ్రీరమణ మహర్షికి క్యాన్సర్ ఎందుకు వచ్చింది, అని మనకు ఆశ్చర్యం కలుగుతుంది. ఎన్నో సమాధానాలు చెప్పవచ్చు గాని మన పరిమిత బుద్ధితో జ్ఞానులను అర్థం చేసుకోలేము. ఇంకొక విషయం. నాకు అప్పుడప్పుడు సుమారు 18 ఏళ్ళ వయసు వున్నప్పుడు, ఆశ్రమ హాలులో కూర్చున్న సమయంలో నాకు అనుకోని అనుభవం జరిగేది. భగవాన్ సమక్షంలో వున్నప్పుడే మనసు అగ్ని పర్వతం లాగా పొంగి భయంకరమైన ఆలోచనలతో నిండిపోయేది. అలాగ తెరలు తెరలుగా వచ్చే ఆలోచనలను తట్టుకోలేక ఒక్కొక్కసారి బయటికి వెళ్ళి కొంతసేపు అరుణాచలం కొండవైపు తదేకంగా చూసిన తరువాత కొంత సమయం - పది నిమిషాల నుండి గంటపైగా - అలాగే వుండేది. భగవాన్ సమక్షంలో వున్నప్పుడు అలాగ శాంతిగా లేకుండక పోవడం గురించి నన్ను నేనే తిట్టుకునే వాడిని.

ఈ సంగతి చెప్పడానికి కారణం ఏమంటే, మీలో చాలా మంది ధ్యానం చేస్తున్న సమయంలో మనసు ఏకాగ్రతను కోల్పోయి వివిధ



ఆలోచనలకు గురి అవుతుందని చెబుతారు. దాన్ని గురించి కలత పడనవసరం లేదని నా అనుభవం వల్ల చెప్ప గలుగుతున్నాను. లోపల వున్నది బయటపడవలసిందేనని భగవాన్ అనేవారు. వాటంతట అవే అలసిపోతాయి. పలు జన్మల సంస్కారాలు వెలికి రావలసి వుంటుంది. మీ ఇష్టదేవత గురించి లేదా భగవాన్ గురించి ధ్యానం చేస్తే భగవాన్ అంతర్లీనంగా మనసులో దాగి వున్న ఆ ఆలోచనలను కడిగి వేస్తారు. ఆ సంగతి మనకు తెలియనీయ కుండానే జరుగుతుంది. అందరి విషయంలో ఇది జరుగుతుంది. భగవాన్ అలాంటి ఆలోచనలను తన శక్తి, ప్రశాంతతలతో తొలగించి వేస్తారు.

## భగవాన్ ప్రభావం

కాబట్టి, అలాంటి అనుభవం గురించి నిరుత్సాహపడనవసరం లేదు. ఆ సమయంలో భగవాన్ ఫోటో వైపు చూసి అలాగ ఎందుకు జరుగుతుందని ఆర్ద్రతతో ప్రశ్నిస్తే చాలు. కలత చెందిన మనసు చాలా కాలం పాటు ఎంతో శాంతిని అనుభవిస్తుంది. అందుకే ధ్యానం చేస్తున్న సమయంలో లోపలి నుండి ఎన్నో ఆలోచనలు భగవాన్ ప్రభావం వల్లనే బయటపడుతున్నాయని అనుకోవచ్చు. ఆ విషయాన్ని గుర్తిస్తే మన అశాంతికి కారణం తెలుస్తుంది. భగవాన్ చెప్పినట్లు కోటలోని సైనికులు ఒకరొకరు బయటకు వస్తే, ఒకరొకరిగా చనిపోతారు. అలాగే భగవాన్ కృప వల్ల వాటిని మనం గుర్తించిన వెంటనే ఆయన కృప కారణంగా ఒకటొకటి నశిస్తాయి.

## విలక్షణమైన భావనలు

భగవాన్ జీవితకాలంలో నాకు జరిగిన అనుభవాలను గురించి చెబుతుంటే, ఒక్కొక్క అనుభవం ఒక విధంగా వుంటుంది. మహర్షి జీవించి వున్నప్పుడు నాకు గిరి ప్రదక్షిణం చేయాలన్న గట్టి కోరిక ఎప్పుడూ వుండేది కాదు. ఆయన శరీరంతో వున్న రోజుల్లో ఒకసారి మాత్రమే గిరి ప్రదక్షిణం చేశాను. ఆ చిన్న వయసులో భావాలు ఇప్పటిలాంటివి వుండేవి కావు. నాకు భగవాన్‌ను వదిలి కొద్ది సమయం కూడ వెళ్ళకూడదన్న అభిప్రాయం చాలా ఉధృతంగా వుండేది. అన్నీ, అంతా భగవానేనన్న అభిప్రాయం వుండేది, అందుకే గిరి ప్రదక్షిణ గురించి ప్రాధాన్యం ఆ రోజుల్లో చూపలేదు. ధ్యానం పట్ల మాత్రం విపరీతమైన ఆసక్తి వుండేది. ఆత్మవిచారణ గురించి భగవాన్ చెప్పిన సూచనలు అనుసరించడం ముఖ్యమని భావించేవాడిని.

మా మామయ్య కావ్యకంఠ గారి గొప్ప భక్తుడు. గణపతి ముని రచించిన శ్లోకాలన్నింటిని, అలాగే భగవాన్ యొక్క రచనలను ఎప్పుడూ పాడుతుండేవారు. నాయన రచనలను చదవమని నన్ను అడుగుతుండేవారు. భగవాన్ రచనలే నాకు ఇష్టమని వాదించేవాడిని. ఈ విషయమై తరచు నన్ను కోప పడేవాడు. భగవాన్ యొక్క "నేను ఎవరు?" అన్న మార్గం సాధారణ వ్యక్తులకు కాదనే వాడు. భక్తి మార్గాన్ని అనుసరించమని నాకు సలహా ఇచ్చేవాడు. నేను వయసులో చిన్నవాడైనప్పటికి, ఆయనతో వాదించేవాడిని. మామూలు వ్యక్తులకు 'నేను ఎవరు' విచారణ మార్గం సరియైనది కాకపోతే, భగవాన్ అలాగ ఎందుకు చెబుతారని



అనేవాడిని.

మీలో కొందరికి ఇది వింతగా తోచవచ్చు కాని భగవాన్ నిర్వాణ సమయం వరకు నాకు రామాయణ, భగవద్గీతలపై ఆసక్తి వుండేది కాదు. భగవాన్ రచన అక్షరమణమాలను మాత్రమే పఠించేవాడిని. ''నేను ఎవడిని'' రచనలో భగవాన్ చెప్పిన విషయాలు చాలునన్న అభిప్రాయం వుండేది. భగవాన్ నిర్వాణం తరువాత రెండు మూడేళ్ళకు గాని రామాయణ, మహాభారతాలు చదవడం మొదలు పెట్టలేదు. నేను చదువుతుండినది ఆదిశంకరుల వివేకచూడామణి, తమిళంలో భగవాన్ అనువాదం చేసిన మరొక రచన మాత్రమే. మహర్షి దేవాలయంలో శ్రీచక్ర ప్రతిష్ట చేశారన్న ఒక్క కారణం వల్లే లలితా సహస్రనామాలను కంఠస్థం చేశాను. ఇప్పటికీ, ఇతర రచనల అవసరంలేదనిపిస్తుంది. కాని అలా అనుకున్నప్పుడు ఎవరో ఒకరు ఒక పుస్తకం ఇచ్చి దాని అభిప్రాయం చెప్పమంటారు.

అందుకే భగవాన్ పలుకులు జ్ఞాపకం వస్తాయి. ఏదో ఒక సంకల్పం అంటూ చేయరాదు. చదవాలి లేదా ఒకదాన్ని చదవవద్దు అన్న నిర్ణయం తీసుకోవద్దు. ఏదైనా మనకు సంఘటన ఎదురైతే దానిని సంతోషంగా అనుభవించు. మనంతట మనం కోరనవసరం లేదు. ఈ నా అనుభవాలు చాలా ఏళ్ళు చెప్పటానికి తటపటా యించాను. కాని నా మార్గమే సరియైనది అని చెప్పడం లేదు. ప్రతి ఒక్కరూ ఒక మార్గాన్ని ఎన్నుకుంటారు. నిజానికి అలా ఎన్ను కుంటున్నామని అనుకుంటాం. కాని పరమాత్ముడే మనకు మార్గనిర్దేశనం చేస్తాడు.

# శరణాగతి - అంతరార్థం

(మౌంటెన్ పాత్, జులై-సెప్టెంబర్, 2108 సంచికలో శ్రీ నండూరి శ్రీరామమోహన్ గారి వ్యాసం "యాన్ ఇన్‌సైట్ ఇంటూ సరెండర్" యొక్క అనువాదం) అనువాదం: తాడిమేటి సత్యనారాయణ

## గురువుకు శరణాగతి - జనకమహారాజు ఉదంతం

శరణాగతి ఎలాగ అద్భుతంగా పనిచేస్తుందో, శ్రీ భగవాన్ జనక మహారాజు కథ ద్వారా వివరిస్తున్నారు. జనకుడు మిథిలా రాజ్యాధిపతి. ఆయన అష్టావక్రమునితో సత్సంగంలో వుండేవారు. భగవాన్ విశదీకరించిన వివరాలు క్లుప్తంగా చెప్పాలంటే, జనక మహారాజు తనువు, మనసు, ధనాన్ని నిష్కపటంగా, సంపూర్ణంగా గురువుకు అర్పించుకొన్న మరుక్షణం ఆత్మగతుడై సమాధి స్థితిలో నిలకడ చెందారు. గురువు అంటే అజ్ఞానాంధకారాన్ని పోగొట్టువాడు. గురువే ఆత్మ. శిష్యుని అశాంతికి కారణాలైన వృత్తులన్నిటినీ గురువు తొలగించి పూర్ణశాంతిని కలగచేస్తాడు.

జనకుడు శాస్త్రాలు పఠిస్తున్నప్పుడు ఒకచోట "బ్రహ్మ జ్ఞానము క్షణకాలములోనే పొందవచ్చు. ఉదాహరణకు గుఱ్ఱము నెక్కునపుడు ఒక కాలు రికాబు పై పెట్టి రెండవ కాలును ఎత్తి అవతలి వైపు రికాబులో పెట్టే ఆ కొద్ది సమయంలోనే బ్రహ్మజ్ఞానాన్ని పొందవచ్చును" అన్నది చదివారు. జనక మహారాజు పక్వము చెందిన ముముక్షువు. ఒక రాజుగా అనుభవించే సుఖాలు, జ్ఞానం ఇచ్చే ఆనందానికి సమం కాదని బాగా గ్రహించినవారని ఈ కథనం ద్వారా తెలుస్తోంది. జనకుడు తన శరీరాన్ని, మనస్సును, సకల సంపదలను జ్ఞానం కోసం త్యాగం చేయడానికి సిద్ధపడ్డాడు. భగవాన్



చెప్పిన ఈ కథ ద్వారా మనకు ఒక విషయం తెలుస్తోంది. సాధకుని ప్రయత్నం సఫలం అవ్వాలంటే, జ్ఞానానికై తపించడం, తన సొంతాన్ని అంతా త్యాగం చేయడానికి సిద్ధపడటం, బంధాలను త్రెంపుకొనడం ఇవి తప్పనిసరిగా ఉండవలసిన లక్షణాలు.

శాస్త్రాలలో చెప్పినట్లు బ్రహ్మజ్ఞానాన్ని ఒక క్షణంలో పొంద వచ్చును అనే విషయం నిజమేనా, దానిని నిరూపించగలరా అని జనక మహారాజు తన ఆస్థాన పండితులను ప్రశ్నించారు. రుజువు పరచడానికి వెంటనే ఒక అశ్వాన్ని కూడా ఏర్పాటు చేసారు. పండితులందరూ శాస్త్రము చెప్పినది నిజమని, కాని దానిని ఋజువు పరచలేమని తమ అశక్తతను తెలిపారు, ఆ మాటతో వారినందరినీ చెరలో బంధించాడు జనకుడు. అపుడే అష్టావక్ర ముని తన రాజ్యంలో ప్రవేశించారు. జరిగిన వృత్తాంతాన్ని విన్నారు. గొప్ప తేజస్సుతో కనబడుతున్న మునిని జనకుడు చూశాడు. వెంటనే ఎంతో భక్తిశ్రద్ధలతో వారికి సాష్టాంగ నమస్కారం చేశారు. అష్టావక్రముని సంతోషించి జనకునితో "మీరు జ్ఞానానికై తపించడం ఎంతో సంతోషంగా ఉంది. బ్రహ్మజ్ఞానం కావాలంటే గురువు కావాలని శాస్త్రాలు చెప్పలేదా? అర్హత, యోగ్యత లేని వారికి గురువు దీక్ష ఇవ్వరన్న విషయం కూడా మీకు తెలుసును కదా?" అన్నారు. మునీంద్రులు అడిగిన ప్రశ్నలకు "అవును" అని సమాధానమిచ్చారు జనకుడు. "మీరు ఆత్మసాక్షాత్కారానికి దీక్షను ఆశిస్తే నాపై సంపూర్ణమైన నమ్మకంతో, నన్ను గురువుగా స్వీకరించాలి. చెరసాలలో వున్న పండితులందరిని విడిపించాలి. ఆ తరువాత

గుఱ్ఱమెక్కి నాతో అరణ్యానికి రావాలి. అక్కడ మీరు ఉపదేశానికి అర్హులా కారా అని పరీక్షిస్తాను'' అన్నారు అష్టావక్రముని.

మునీంద్రులు, జనకుడు అరణ్యం చేరారు. రాజుగారి వెంట వచ్చిన అనుచరులను వెనక్కు పంపించారు. రాజుగారు గుఱ్ఱంపై ఎక్కడానికి ఒక కాలిని రికాబుపై పెట్టిన క్షణమే, ''ఆగండి! నాకు గురుదక్షిణ ఏది?'' అని అష్టావక్రముని ప్రశ్నించారు. వెంటనే జనకుడు ''నా శరీరం, మనస్సు, సంపదనంతా మీ పాదాల చెంత ధారపోస్తున్నాను'' అన్నారు. అష్టావక్రముని ఈ మాటలు విన్నవెంటనే పరుగున వెళ్లి దగ్గరలో వున్న చెట్ల పొదలలో దాక్కున్నారు. జనకుడు రికాబుపై పెట్టిన కాలు పెట్టినట్లే కదలక వుండి పోయారు.

## మిథిలకు మళ్ళీ రాక

సూర్యాస్తమయం అయింది. రాజుగారి మంత్రులు, ఇతరులు, జనకుడు అరణ్యం నుండి ఇంకా తిరిగి రాలేదని ఆదుర్దా పడి వారికోసం అరణ్యంలోనికి వెళ్లారు. అక్కడ రాజు ఒక శిల లాగ చలనం లేకుండా రికాబుపై ఒక కాలు పెట్టి నిలబడి వుండడం చూసి నిశ్చేష్టులయ్యారు. మంత్రి రాజుగారిని ఇలాగ ఎందుకు వున్నారని ప్రశ్నించినా రాజు నుండి ఏ సమాధానమూ రాలేదు. అక్కడ వున్న అష్టావక్రముని వారికి కనబడలేదు. వెంటనే రాజుని వారి రాజభవనానికి తీసుకొని వెళ్లి, పడకగదిలో పడుకోబెట్టారు. వారు పరుపుపై కూడా అలాగే కదలకుండ ఉండిపోయారు. మంత్రులు ఎంత ప్రయత్నించినా, వారు సమాధానమివ్వకుండ



మౌనంగా వుండి, ఆహారంగాని, ఒక గుక్క మంచి నీరు గాని ముట్ట లేదు. వారు కదలలేదు, మెదలలేదు. ఒకవేళ ముని రాజుగారిపై మంత్రంగాని ప్రయోగించారా యని సందేహించి, మునిని కనుగొనేందుకు అశ్వికదళాన్ని పంపారు మంత్రి.

అశ్వికదళం మునీంద్రులను కలిసి రాజు పరిస్థితిని వివరిస్తూ జరిగినదేమిటని అష్టావక్రమునిని అడిగారు. ''మీరు వెళ్లి రాజుగారినే అడగండి'' అని ముని బదులిచ్చారు. ''రాజు మాటలేక మూగబోయి, తిండి, నీరు లేక గత రెండు రోజులుగా పడివున్నారు'' అని అశ్వికదళం సమాధానమిచ్చింది.

అష్టావక్రముని రాజుగారిని భుజించమని చెప్పగానే, వారు ఆహారం తీసుకుని, తిరిగి నిశ్చేష్టులై ఉండిపోయారు. మంత్రులందరూ తిరిగి రాజును మామూలు మనిషిగా చేయమని మునిని ప్రాధేయపడ్డారు. 'సరే' నన్నారు ముని. వారందరినీ గది బయటకు వెళ్లమని చెప్పి తలుపులు మూసివేశారు, రాజుని ''ఎందుకు మీరు ఇలాగ నిశ్చేష్టులై వున్నారు?'' అని ప్రశ్నించారు మునీంద్రులు.

రాజు తన శరీరాన్ని చూపిస్తూ ''తన శరీరంపై తనకు ఎట్టి హక్కులేదని, కాళ్లు, చేతులు తనవి కావని, నాలుక, కళ్లు, చెవులు ఇంద్రియాలు ఏవీ తనవి కావని'' సమాధానమిచ్చారు. రాజ్యం తనది కాదన్నారు, సర్వమూ గురువులయిన అష్టావక్రమునికి సమర్పించానని, వారి అనుమతి లేకుంటే తాను ఏమీ చేయలేనని, అందుకే తాను నిశ్చేష్టులై వున్నానని చెప్పారు.

## జనకునికి ఆత్మసాక్షాత్కారం

జనకుని మాటలు విన్న అష్టావక్రముని రాజుగారి భక్తి, శ్రద్ధలకు మెచ్చి తన చేతులను రాజుగారి శిరస్సుపై నుంచి, మిమ్ము పరీక్షించడానికే ఈ విధంగా చేయవలసి వచ్చిందన్నారు. ముని ఈ క్షణమే మీరు బ్రహ్మస్వరూపులు, ఆత్మసాక్షాత్కారము పొందినవారు, చేయవలసినదంతా చేసినవారు, పొందవలసినదంతా పొందిన వారు'' అని పలికారు. అటుపై వారిద్దరి మధ్య సంభాషణలలో, గురువును శరణొందిన పిమ్మట ఎలాగ బ్రహ్మస్వరూపాన్ని పొందాలో వివరించారు.

అలాగ జనకుడు సంపూర్ణంగా శరణొందిన స్థితి, భగవాన్ తమ మరణానుభవ సమయంలో శరణొందిన స్థితి వంటిదే. రెండింటికీ ఎటువంటి తేడా లేదు.

భగవాన్ భక్తులందరికీ ''తిన్నెస్వామి'' గురించి తెలిసినదే. భగవాన్ ''ఉండు'' అని అన్న మాటను అక్షరాల పాటించి సమాధి స్థితికి చేరుకొన్నారు. శ్రీ మురుగనార్, ముస్తాన్ స్వామి మరెందరో భక్తులు భగవాన్ అనుగ్రహంతో ఆత్మసాక్షాత్కారం పొందారు. పాల్‌బ్రంటన్ తన ప్రథమ దర్శనంలోనే భగవాన్ సమక్షంలో పొందిన అనుభవాలను గురించి చెబుతూ ''ఇంతవరకు నన్ను వేధించిన సమస్యలను నేను పరిష్కరించానా లేదా అన్నది ముఖ్యం కాదు. ఒకటి మాత్రం నిజం, భగవాన్ సమక్షంలో వున్నపడు ఒక ప్రశాంతత అనే నది నా వద్ద ప్రవహిస్తూనే ఉన్నదని నాకు ఎఱుక. ఒక మహా ప్రశాంతం నాలో చొచ్చుకొని పోయి, తలపులతో సతమతమవుతున్న నా మనస్సును చివరకు శాంతింపజేసింది'' అని అన్నారు.



# అమరత్వ చేతన

**- డా. తోట శ్రీనివాస్**

*శ్రీరమణ మహర్షి ప్రధానంగా సందర్శకులు, సాధకుల ప్రశ్నలు, ఆధ్యాత్మికపరమైన అనుమానాలకు జవాబుల రూపంలోనే తమ బోధనలను సాగించేవారు. ప్రపంచానికి ప్రథమంగా మహర్షి గొప్పదనాన్ని చాటిచెప్పిన వారు బ్రిటిష్ రచయిత పాల్‌బ్రంటన్. రమణులతో జరిపిన తమ సంభాషణల సారాంశాన్ని, వివిధ ఆధ్యాత్మిక విషయాలను సంకలనం చేశారు. ఆ సంపుటాన్ని శ్రీరమణాశ్రమం వారు ''కాన్షస్ ఇమ్మోర్టాలిటీ'' అనే గ్రంథంగా ప్రచురించారు. సరళంగా సాగే ఈ ప్రశ్నోత్తర మాలికను శ్రీరమణ జ్యోతి పాఠకుల కోసం **డా. తోట శ్రీనివాస్** అనువదించారు. **'అమరత్వ చేతన'** అనే శీర్షికతో డా. తోట శ్రీనివాస్ గారి అనువాదాన్ని ధారావాహికంగా ప్రచురిస్తున్నాం. - సంపాదకుడు.*

### పుస్తక పరిచయం

పాల్‌బ్రంటన్ అనే ఇంగ్లీషు రచయిత ప్రపంచ దేశాలన్ని తిరిగి సత్యాన్వేషణ కొరకు భారతదేశం 1930లో వచ్చారు.వారు కంచి పరమాచార్య, విశుద్ధానంద పరమహంస లాంటి యోగులను కలిశారు. కంచి పరమాచార్య సలహా మేరకు బ్రంటన్ భగవాన్ రమణ మహర్షిని కూడా కలిశారు. ఆయన భగవాన్‌ను మొట్ట మొదటిసారిగా "In search of Secret India" అనే పుస్తకంలో పాశ్చాత్య ప్రపంచానికి తెలియజేశారు. ప్రపంచం అంతా తిరిగినప్పటికీ పాల్‌బ్రంటన్‌కు జ్ఞాన తృష్ణ తీరలేదు. ఎన్నెన్నో ప్రశ్నలు ఆయనను చుట్టుముట్టేవి. భగవాన్ రమణ మహర్షిని చూడగానే

ఆయన ప్రశ్నలన్నీ పటాపంచలయి ఎన్నడూలేని మహా సముద్రమంత కాంతిపుంజం ఆయనను ఆవరించి ఉక్కిరిబిక్కిరి చేసింది. ఆ క్షణం నుంచి ఆయన భగవాన్ పాదాల చెంత తన జీవిత సర్వస్వాన్ని అర్పించి శిష్యుడు అయిపోయినాడు.

ఈ "అమరత్వ చేతన' పాల్ బ్రంటన్ మరియు భగవాన్ రమణ మహర్షుల మధ్య జరిగిన సంభాషణల పరంపర "Conscious Immortality" పేర 1984 లో ఆంగ్లంలో ప్రచురించబడింది. దైనందిన జీవితము, యోగా మరియు ప్రాణాయామము, ధ్యాన సాధన, మనస్సు, అహంకారము, మాయ, జనన మరణాలు, మతం యొక్క అర్థం, గురువు శిష్యుడు, ఆత్మసాక్షాత్కారం మరియు తదితర అంశాల మీద బ్రంటన్ అడిగిన ప్రశ్నలకు భగవాన్ సమాధానమిచ్చారు. ఈ ప్రశ్నలన్ని మీవి, నావి, మనందరివి. మన మనస్సులో తలెత్తే ప్రతి ప్రశ్నకు మనకు ఈ పుస్తకంలో సమాధానం దొరుకుతుంది. భగవాన్ రమణ మహర్షుల వేదాంతసారం ఈ పుస్తకంలో ఉంది. ప్రతి ప్రశ్నకు ఇచ్చిన సమాధానం అద్భుతంగా సాగుతుంది, మరియు ఆత్మసాక్షాత్కారం వైపు సాధకులను నడిపిస్తుంది.

## ముందు మాట

ఆత్మ పరమాత్మలు బింబ ప్రతిబింబాలు. నీవు అటూ, ఇటూ మానేసి జాజ్జ్వల్యమానంగావెలుగుతున్న బింబ స్వరూపాన్ని, పరమాత్మగా దర్శించు. అంటే నీ వైపు చూసుకో. నిన్ను నీవు చూసుకుంటే పరమాత్మను దర్శించినట్లే. ప్రతిబింబం తనవైపు చూడడం ఎలా? బింబం వైపు చూస్తేనే, తనను తాను చూడడం



జరుగుతుంది. అలా చూస్తే ఏం తెలుస్తుంది? బింబమనే పరమాత్మ ఎప్పుడూ నీ వైపే చూస్తున్నట్లనిపిస్తుంది. పరమాత్మ అనుగ్రహం అనుశ్రుతంగా, ధారాపాతంగా నీ పై వర్షిస్తుందన్న విషయం తెలుస్తుంది. అంతేకాదు, నీవు ప్రతిబింబ మాత్రంగా ఉండకుండా బింబమే అసలైన ఉనికి అని, ఆ బింబమే లేకపోతే నీకు ఉనికి లేదని గ్రహిస్తావు. ఆయనే సచ్చిదానంద స్వరూపుడని తెలుస్తుంది.

ప్రతిబింబమైన నీవు బింబం వైపు దృష్టిని సారించగానే ఆ బింబమే నీ ఉనికి అని తెలియడమే కాకుండా, నీ దృష్టి అనేది బింబం యొక్క దృష్టియేగాని, దానికి భిన్నంగా నీకంటూ ఏ దృష్టీ లేదనికూడా తేటతెల్లమవుతుంది.

అద్దం ఉన్నంత సేపే ఈ బింబ, ప్రతిబింబ దర్శనం అనే మాయా మహిమాన్విత విలోకనం, విలాసం. అద్దమే లేకపోతే? అద్దం అంటే అంతఃకరణం. అంతఃకరణం అనే మనస్సు నశిస్తే ప్రతిబింబం మాయమవుతుంది. బింబంలో విలీనమై పోతుంది. సంలీనమై పోతుంది. బింబం బింబంగా ఉండడమే స్వస్వరూప స్థితి, మనోరహిత స్థితి, వృత్తిశూన్య స్థితి, స్వస్థితి అదే సహజ స్థితి.

## దైనందిన జీవితంపై

నీకు వినా ఆనందం ప్రపంచంలో లేదు. నీలోనే ఉంది. బాహ్యమైన వస్తువులు నీకు సంతోషాన్నిస్తున్నాయంటే అది చాలా పెద్ద పొరపాటవుతుంది. నిజంగా జరిగేదేమిటంటే, నీకు తెలియకుండానే అది ఆత్మగతమై నీకు ప్రసాదించబడుతుంది. ఆనందం నీకు నీడలాగా వస్తుంది. మరి అది ఎక్కడ్నుంచి వస్తుందో, దాని

మూలమేంటో కనుక్కో. మూలలు వెతికితే ఏమీ లాభం ఉండదు. నువ్వెవరో నిరంతరం వెతికితే నీకు ఆత్మసాక్షాత్కారమవుతుంది.

బ్రం: ఆధ్యాత్మిక సాధనకు మొదటి మెట్లు ఏవి?

భ: సాధకులకు వారు శరీరం కాదనే విషయం తెలియచెప్పాలి, ఎందుకంటే వారు వాళ్ళంటే శరీరమే అనుకుంటారు. వారు శరీరమే కాదు సర్వమూ అని చెప్పాలి. శరీరమొక భాగం మాత్రమే. సాధకులు ఈ విషయాన్ని గట్టిగా గమనించాలి. జడం నుంచి చైతన్యాన్ని, వేరు చేయాలి. నువ్వు చైతన్యమని గుర్తించాలి. ఆ తరువాత వారికి జడం చైతన్యం ఒకటేనన్న విషయం తెలియచెప్పాలి. అదే వివేచన, అదే వివేకం (discrimination). ఈ వివేకం జీవితాంతం సాగాలి అదే మోక్షానికి దారి తీస్తుంది.

బ్రం: మనిషి ఎలా జీవించాలి?

భ: అది మనిషి జ్ఞానియా, అజ్ఞానియా అన్న విషయం మీద ఆధారపడి ఉంటుంది. జ్ఞాని దేన్ని కూడా తన ఆత్మ కంటె భిన్నంగా చూడడు. ప్రతిది ఆత్మపరంగానే చూస్తాడు. అన్నీ ఆత్మలోనే దర్శిస్తాడు జ్ఞాని. దృష్టిని బట్టి సృష్టి ఉంటుంది.

బ్రం: ప్రాపంచిక విషయాలతో తలమునకలవుతున్న మనిషికి మౌనం ఎలా సాధ్యం?

భ: స్త్రీలు పల్లెటూళ్లలో నీళ్ళ కుండలు నెత్తిమీద పెట్టుకుని నడుస్తూ మాట్లాడుకుంటూ వెళతారు కాని వాళ్ళ ధ్యాస నీళ్ళ కుండ మీదినుంచీ మరల్చరు. అలానే ఒక యోగి చాలా



కార్యక్రమాల్లో నిమగ్నమైనా ఆయన ధ్యాస, ధ్యానం పరబ్రహ్మంలోనే విలీనమై ఉంటుంది. ఆయనను ఎవరూ ప్రాపంచిక విషయాలపైకి మరల్చలేరు.

ఇక్కడ సమస్య ఏమిటంటే ప్రజలు అన్నీ వాళ్ళే చేస్తున్నామను కుంటారు. అదే పెద్ద పొరపాటు. వాళ్ళను దైవశక్తి నడిపిస్తుంది; ప్రజల ప్రమేయం ఏదీ ఉండదు. వాళ్ళు వట్టి పనిముట్లు మాత్రమే. వాళ్ళకు చేతులు వాళ్ళవి, చేతలు చేయించే వాడివి అన్న భావన వస్తే కష్టాలనేవి అసలు ఉండవు. నువ్వు పనులు చేస్తూ పోవాలి వాటి ఫలితాన్ని ఆశించరాదు.

(కృష్ణుడు "కర్మణ్యేవాధికారస్యే మాఫలేషు కదాచన" అంత కంటే నీవు ఏమి చేయలేవు)

బ్రం: యువతీయువకులు ఈ నగ్న సత్యాన్ని అర్థం చేసుకోలేరు కదా వాళ్ళకు ఎలా తెలియచెప్పేది?

భ: కాలానుగుణంగా వాళ్ళకు తెలియచెప్పే ప్రయత్నం చేయాలి. ఆ తపన ఉన్నవాళ్ళు క్రమంగా సత్యాన్ని గ్రహిస్తారు.

బ్రం: ఈ ప్రపంచం అజ్ఞానంలో ఎందుకుంది?

జ: సృష్టికర్తను, ప్రపంచాన్ని తన పనిని తను చేసుకోనివ్వండి. నువ్వు శరీర భావాన్ని కలిగినప్పుడు నీకు భౌతిక ప్రపంచం కనిపిస్తుంది. నీకు ఆత్మ భావన ఉన్నప్పుడు జగత్తంతా ఆత్మే నిండి ఉంటుంది. నీలో "అహం" స్ఫురణ ఉన్నదని నీవు గమనిస్తే అది వెంటనే అంతర్ధానమువుతుంది. మాయమవు తుంది. నువు ఎవరని ప్రశ్నిస్తే నీ అజ్ఞానం అంతరించిపోతుంది.

మనసు మాయాజాలమే ఈ కష్టాలు, ఈ చీకటి. అందుకే ఆత్మ వివేచన చేయాలి. ఆత్మజ్ఞానివి కావాలి.

బ్రం: మనిషి ఎప్పుడూ ఆత్మ స్ఫురణలో ఉంటే ఆయన చేసే పనులు ఎప్పుడూ సక్రమంగా ఉంటాయా?

భ: అవును ఉండాల్సిందే. ఎందుకంటే ఆత్మ స్ఫురణ ఉన్న వ్యక్తికి మంచి చెడులతో సంబంధం లేదు. వాడు చేసే పనులన్ని దైవికాలే కాబట్టి సక్రమాలే అవుతాయి.

బ్రం: ప్రాక్ పశ్చిమాలను దగ్గరకు తీసుకురావడం వల్ల ప్రయోజనం ఉందా?

భ: అలాంటి సంఘటనలు వాటంతట అవే జరిగిపోతాయి. జాతుల గమనాన్ని నిర్దేశించే ఒక శక్తి ఉంది. నువు సత్యానికి వాస్తవికతకు దూరంగా ఉంటే ఇలాంటి ప్రశ్నలు తలెత్తు తాయి. సత్యశోధన చేయాలి. ఆ ప్రశ్నలు అప్పుడు వాటంతట అవే సమసిపోతాయి.

బ్రం: పాశ్చాత్యులకు అంతర్ముఖం కావడం కష్టమా?

భ: ఔను. ఎందుకంటే వారు రాజసికులు, వాళ్ళ శక్తి బయటికి వెళ్ళిపోతుంది. మనం అంతర్ముఖంగా శాంతి అనుభవించాలి. మనం అఖండమైన బ్రహ్మానందాన్ని అనుభవించాలంటే మనం అంతర్ముఖులు కావడం కంటె వేరే మార్గం లేదు.

బ్రం: పాశ్చాత్యానికి పౌర్వాత్యానికి మధ్య తేడా ఏంటి?

భ: తేడాలేమి లేవు. అందరు చేరాల్సిన గమ్యమొకటే.

బ్రం: నేనొక పాపిని.



భ: మీరలా ఎందుకు ఆలోచిస్తున్నారు. మీరు సంపూర్ణమైన నమ్మకంతో విశ్వాసంతో, మీ బాధ్యతలన్నిటిని భగవంతుని పై భారం వేయండి. మీ యోగక్షేమాలన్ని ఆయనే చూసు కుంటాడు. ఇంకా దిగులెందుకు. (అనన్యాశ్చింతయంతోమా.)

బ్రం: ఈలోగా కొంతమంది భక్తులు ఇతర భక్తుల గురించి ఫిర్యాదు చేసారు.

భ: అపుడు భగవాన్ అన్నారు, ఇంతకూ మీరు మిమ్మల్ని ఉద్ధరించుకుందామనుకుంటున్నారా? లేదా ఇతరులను ఉద్ధరిద్దామనుకుంటున్నారా?

బ్రం: ఈ స్వచ్ఛమైన వాతావరణంలో సాధన సులభం, కాని పట్టణా లల్లో కష్టం కదా?

భ: నీ ఆత్మ స్వచ్ఛం కాదా, ప్రశాంతం కాదా! నీ శరీరానికి ఏది కావాలో అది చేయనీయండి, మీరెందుకు అలా ఆలోచిస్తారు. ఎలాంటి విషయాలల్లో తగులం లేకుండ నిశ్శబ్దంగా ఊరికే ఉండండి. అలా చేయనప్పుడు నిశ్శబ్దంగా ఉండి ఏం ప్రయోజనం. నీవు చాలా విషయాలల్లో నిమగ్నమైనా ఆత్మ సాక్షాత్కారానికి నిరంతరం ప్రయత్నం చేయాలి.

బ్రం: నేను కైలాసం వెళ్ళాలనుకుంటున్నాను.

భ: ప్రారబ్ధంలో ఉంటేనే ప్రదేశాలు చూడగలరు. వేరే రకంగా కాదు. ఎన్ని చూసినా ఇంకా చూడవలసినవి ఉంటాయి. ఈ లోకంలో లేకుంటే మరో లోకంలో. జ్ఞానానికి పరిమితు లున్నాయి. *(సశేషం)*

# శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# టి.ఆర్. కనకమ్మాళ్

కాట్రావులపల్లి సుబ్బలక్ష్మి

టి.ఆర్. కనకమ్మాళ్ 1922లో బాగా ఆచార వ్యవహారాలు కల్గిన కుటుంబంలో జన్మించారు. ఆమె బంధువైన రామకృష్ణ అయ్యర్ అనే ఆయన తిరువణ్ణామలైలో మునసబ్‌గా పనిచేస్తుండేవారు. ఆయన రమణమహర్షి భక్తుడు. ఆవిడ చిన్నతనంలో తల్లి దండ్రులు తిరువణ్ణామలైలో భగవాన్ వద్దకు వెళ్లిన ప్రతిసారి ఆవిడ కూడా వాళ్ళతో వెళ్ళి భగవాన్‌ను దర్శించి రెండు, మూడు రోజులు ఉండి వాళ్ళతో తిరిగి వచ్చేవారు. తమిళంలో ఆమె వ్రాసిన 'మధుర స్మృతులు' అనే పుస్తకంలో ఆమె జ్ఞాపకాలను పంచుకున్నారు. అంతేకాక గురురమణ అనే వీడియోలోనూ భగవాన్ గురించిన అనుభవాలను పంచుకున్నారు.

## ఆశ్రమంలో తొలి అనుభవం

భగవాన్ ఆశ్రమంలోకి అడుగుపెడుతున్నప్పుడే తనలోని మార్పు తనకు తెలిసింది. వెంటనే అనుకున్న చిన్న చిన్న ఆ చికాకు లన్నీ మాయమయిపోయి ప్రశాంతమైన అనుభూతిని ఆమె పొందారు. ఆమె ఎనిమిది ఏళ్ళ వయస్సులో ఉన్నప్పుడు వాళ్ళ పెద్దనాన్నగారితో మొదటిసారిగా భగవాన్ ఆశ్రమానికి వెళ్ళారు. ఆ సమయంలో హాల్ నుండి కొండకి నడిచి వెళ్ళే దారిలో ఒక బాదం చెట్టు క్రింద భగవాన్‌ను చూశారు. వాళ్ళ పెద్దనాన్నగారితో పాటు



ఆమె కూడా భగవాన్‌కి నమస్కరిస్తున్నప్పుడు భగవాన్ చిరునవ్వుతో చూసిన చూపు ఆమె యొక్క మనస్సును ప్రభావితం చేసింది. ఆమె ఎప్పుడు భగవాన్‌ను తలచుకున్నా ఆ నవ్వే ఆవిడకి గుర్తుకు వచ్చేదని కాలాంతరంలో తోటి సాధకులకు చెప్పారు. ఆమె దగ్గరి బంధువు రాధ గురించి రాధా ఎక్కడ? అని ప్రశ్నించటమే ఆమెతో భగవాన్ జరిపిన మొదటి సంభాషణ. ఆమె రాసిన మధుర జ్ఞాపకాలు అనే పుస్తకంలో 9వ అధ్యాయంలో రాధను గురించి ఉంటుంది. ఆవిడ తన 18 సం॥ల వయస్సులో భగవాన్ వద్దకు వెళ్ళినప్పుడు ఆమె కన్నుల వెంట ధారాపాతంగా నీరు కారాయి. ఆ సమయంలో హాల్‌లో అందరూ ధ్యానం చేస్తూ ఉండటంతో ఆమె భగవాన్‌తో మాట్లాడలేకపోయింది. కాని తన మనస్సులో మాత్రం ఓ భగవాన్! అందరూ ధ్యానం చేస్తున్నారు. నన్ను మాత్రం ఇలా కొన్ని రోజులే ఇక్కడ ఉంచి ఇంటికి పంపిస్తున్నారు. ఎంత కాలం నేను ఇలా రాకపోకలు చేయాలి. వీళ్ళందరి లాగా నేను ఎప్పుడూ ఇక్కడ ఉండేటట్టుగా ఆశీర్వదించండి అని అనుకొని కళ్ళు తెరిచి భగవాన్ వైపు చూసేసరికి వెంటనే దానికి సమాధానంగా భగవాన్ తల వూపారు. ఆ సమయంలో కరుణాపూరితమైన భగవాన్ చూపును ఆవిడ అనుగ్రహంగా గ్రహించారు. 1946 నుంచి ఆమె అక్కడ ఉండటం ప్రారంభించారు.

1946కు ముందు ఒకరోజు ఆమెకు ఒక విచిత్రమైన అనుభూతి కలిగింది. అరుణాచలంలో 3 రోజులు గడిపిన పిమ్మట యథా ప్రకారం ఆవిడ ఇంటికి వెళ్ళేటప్పుడు అంతకు ముందు

లాగానే మనస్సులో తను అక్కడ ఎప్పుడూ ఉండే విధంగా భగవాన్ ఆశీర్వదించాలి అని అనుకుంటూ అదే భావనతో భగవాన్ వైపు చూస్తూ ఇంటికి వెళ్ళిపోయారు. ఒకరోజు ఆమె ఎప్పటిలాగా తెల్లవారు ఝామున ధ్యానం చేసుకుందామని లేవబోయే ముందు, భగవాన్ ఆమె ప్రక్కన కూర్చోని చిరునవ్వుతో "నీవు నాకు ఇచ్చింది ఏమిటి? నీవంటే నాకు అంత ప్రీతి ఎందుకు?" అని అన్నారు. ఆ సంఘటనలో లీనమైన ఆమెకు ఒక చిత్రమైన అనుభూతి కలిగి పరమశాంతి స్థితిలోకి వెళ్ళారు. అటు పిమ్మట వెంటనే లేవలేక చాలా సమయం తర్వాత లేచినప్పుడు కూడా ఆ అపరిమితమైన శాంతి ఆమెను ఆవహించి వుంది. మనస్సు దేని మీద లగ్నం అవ్వక భగవాన్ వద్దకు ఎప్పుడెప్పుడు వెళ్ళాలా అని పరితపిస్తుండేవారు. భగవాన్‌కు చెందినటువంటి పుస్తకాలు చదవటం, ధ్యానం చేయడం మొదలైన వాటితో ఆమె సమయాన్ని గడిపేవారు. తన పనులను యథావిధంగా చేసుకుంటున్నా కూడా ఏదో వింత స్థితిలో, ఉన్న ఆమెను గమనించిన తల్లిదండ్రులు చేసేదిలేక ఆమెను భగవాన్ సన్నిధిలో ఉండటానికి అనుమతించారు.

## దినచర్య

ఆ కాలంలో (1945-46) ఆడపిల్లలను ఒంటరిగా బయటికి పంపేవారుకాదు. ఆమె తండ్రి ఆమెను తీసుకుని తిరువణ్ణామలై వెళ్ళారు. అక్కడ ఆశ్రమంలో ఉండడానికి ఆడవారికి అనుమతి లేదు కాబట్టి ప్రక్కనే ఉన్నటువంటి టౌన్‌లో ఉండే విధంగా నివాసం ఏర్పాటు చేశారు. అప్పట్లో టౌన్‌లో తను ఉండే గది



నుండీ ఆశ్రమానికి వెళ్ళే దారి అంతా అడవిలా ఉండేది. ఆడవాళ్ళు ఒంటరిగా వెళ్ళేటటువంటి ప్రదేశం కాదు. ప్రతి రోజు అక్కడ ఉదయం 5 గంటలకి జరిగే ఉపనిషత్తు పారాయణం కోసం తెల్ల వారు ఝామున 5 గంటలకు ఎవరినో ఒకరిని వెంటబెట్టుకొని ఆమె ఆశ్రమానికి వెళ్ళేవారు. ప్రతిరోజు ఉదయముహాల్ తలుపులు తెరిచే సమయానికి మొదటి వ్యక్తి ఈమె కావడం విశేషం. అప్పుడు ఆశ్రమంలో కొంతమందే భక్తులు ఉండేవారు. సూరినాగమ్మగారు, రంగనాయకమ్మగారు, సుబ్బలక్ష్మీ అమ్మాళ్, మొదలైన మిగతా భక్తులందరూ ఆ ప్రక్కన ఉన్న టౌన్ నుంచి వచ్చి వెళ్తుండేవారు. ఆమె ఉదయమే అక్కడికి వెళ్ళిపారాయణం అయ్యాక భగవాన్‌తో బాటు ఉదయము ఫలహారము, మధ్యాహ్నం భోజనం చేసేవారు. అలా మధ్యాహ్నం 2.30 వరకు భగవాన్ సమక్షంలో గడిపి తిరిగి నడుచుకుంటూ తోటి భక్తులతో పాటు ఇంటికి సాయంత్రానికి చేరేవారు.

1946వ సం॥లో జపాన్‌యుద్ధ సందర్భంగా ఏమీ సరుకులు దొరికేవి కావు. చాలా దూరం నుంచి నీళ్ళు తెచ్చుకునేవారు. ఇంత అవస్థ పడుతున్నప్పుడు కూడా భగవాన్‌ను దర్శించిన వెంటనే ఆయన ఒక్క చూపు తోటి ఆ కష్టం అంతా మటుమాయం అయ్యేదని ఆమె ఎప్పుడూ చెప్తుండేవారు. భగవాన్‌కి దగ్గరగా ఆశ్రమంలోనే నివాసం ఏర్పరచుకోవాలని ఆమె ఎంత ప్రయత్నించినా ఆ చుట్టు ప్రక్కల ఉండటానికి వసతి దొరికేది కాదు. ఎట్టకేలకు కోమటి లక్ష్మీ అమ్మాళ్ అనే ఆమె ఇంటి ప్రక్కన

చిన్న గది దొరకడంతో అక్కడే నివాసం ఉండటం ప్రారంభించారు. ఆ ఇంట్లో కనీస వసతులు కూడా ఉండేవి కావు.

జూబ్లీ హాల్‌లో భగవాన్ ఎప్పుడూ ఒక మూలన కూర్చునేవారు. భక్తులందరూ పాత హాల్ నుంచి జూబ్లీ హాల్‌కి వెళ్ళి భగవాన్‌ను దర్శించేవారు. శ్రీ దేవరాజ ముదిలియార్, జి.వి. సుబ్బరామయ్య గారు, సాంబశివరావు గారు మొదలైన వారందరూ భగవాన్‌తో మాట్లాడుతున్నప్పుడు తనకు కూడా భగవాన్‌తో మాట్లాడలని పించేది. అలా ప్రతిసారి అందరితో పాటు వెళ్ళిన తను కూడా భగవాన్‌తో ఎలాగైనా మాట్లాడలని అనుకున్నప్పటికీ అక్కడికి వెళ్ళగానే అన్నీ మరిచిపోయి ప్రశాంతమైన స్థితిలో ఉండేవారు. ఇంకా చెప్పాలంటే అక్కడికి వెళ్ళిన వెంటనే ఇంద్రియాల పటుత్వం తగ్గి అచేతనంగా అయిపోయేవారు. ఒక్కోసారి ఆమెపై ప్రసరించే భగవాన్ చూపుతో ఆమె మనస్సు ఆత్మలో విలీనమైపోయేది. భగవాన్ చూపు తీక్షణతకు ఆమెకు కళ్ళు తెరిచి ఉంచుకోవడం అసాధ్యమయ్యేది. ఆ చూపు నుంచి ఒక అదృశ్య శక్తి తన లోపలికి చొచ్చుకొని పోయి అంతరంగాన్ని చేరుకున్నట్లు ఉండి, ఆత్మానందం కలిగేది. అటు పిమ్మట కళ్ళు తెరిచి భగవాన్ వైపు చూచినప్పుడు మరల కొన్ని క్షణాలలోనే కళ్ళు వాటంతటవే మూసుకుపోయి, శాంతిలో మునిగిపోయేవారు. కారణం ఆమె వైపు భగవాన్ యొక్క తీక్షణమైన చూపు. ఆ చూపు యొక్క శక్తిని వర్ణించడానికి వీలు కానిదిగా ఆమె తోటి భక్తులతో చెప్పేవారు. ఐనా తన మనస్సులో అనుకున్న ప్రశ్నలన్నింటికీ భగవాన్ వేరే వాళ్ళ ద్వారా సమాధానాలు అందించేవారు. దానితో ఆమె తృప్తి చెందేవారు. *(సశేషం)*



# శ్రీ భగవాన్ సేవలో

- జి. శ్రీహరిరావు

## 4. రమణాశ్రమంలో వెంకిటూ బాల్యం

అమ్మ అలఘమ్మాళ్ మానామధురైలో మరిదిగారు నెల్లియప్ప య్యర్ ఇంట్లో వుండేవారు. 1916లో ఆయన కాలం చేశారు. ఇక ఆమె తన ఆఖరి రోజులు, తిరువణ్ణామలైలో ఋషి పుంగవుడైన తన కుమారుని వద్ద గడపదలుచుకున్నారు. ఆ సంవత్సరమే ఆమె కుమారుడు వున్న విరూపాక్ష గుహ వద్దకు వచ్చేశారు. తల్లివలన శ్రీభగవాన్ ఇంకెక్కడికైనా వెళ్ళిపోతారేమోనని కొంతమంది భయపడ్డారు. కానీ, అప్పటికి శ్రీభగవాన్ అందరితోనూ సహజంగా ప్రవర్తించడం వలన, తన తల్లిగారిని కూడా ఆశ్రమ సభ్యురాలిగా స్వీకరించారు.

అచిరకాలంలోనే నా తండ్రి నాగసుందరంగారు కూడా తన సోదరుని వద్దకు తిరువణ్ణామలై వచ్చేసారు. వారు తర్వాత సన్న్యసించి కాషాయం ధరించసాగారు. ఆయన నిరంజనానంద స్వామిగా పిలవబడసాగారు.1930 ప్రాంతం నుండి ఆయన ఆశ్రమ వ్యవహారాలు పర్యవేక్షించడం మొదలుపెట్టారు. 'చిన్నస్వామి' అని ఆయనను అందరూ గౌరవంగా పిలిచేవారు. ఆయనకు క్రమశిక్షణ చాలా ముఖ్యం. ఆశ్రమ యాజమాన్యాన్ని పూర్తి అంకితభావంతో వారు నిర్వహించేవారు. 1931లో శ్రీ భగవాన్ సమ్మతితోను, దీవెనల తోను ఆయన ఆశ్రమ సర్వాధికారిగా బాధ్యత స్వీకరించారు.

నా నాయనమ్మ అలఘమ్మ తన పెద్దకొడుకు 'పెరియ స్వామి', చిన్న కొడుకు 'చిన్నస్వామి' కోసం మొదలుపెట్టిన వంట కార్యక్రమం కొంతమంది సహకారంతో పెంచి, ఆశ్రమవాసులందరికీ, వచ్చిన

ఆగంతులందరికీ భోజనం పెట్టసాగారు. పెరుగుతున్న ఆశ్రమానికి, విరూపాక్ష గుహ చిన్నదైపోయింది. శ్రీభగవాన్ భక్తుడూ, కష్టజీవీ అయిన కందస్వామి రంగంలోకి దిగాడు. కొంతమంది పనివారి సహాయంతో విరూపాక్ష గుహకు పైన వున్న పశ్చిమ ప్రాంతంలో పొదలూ, ముళ్ళ కంచెలూ నరికి రాళ్ళూ రప్పలూ తీసి, భూమిని చదును చేసాడు. అక్కడ చిన్న తోటలాగా చేసి, ఒక చిన్న కట్టడం ఏర్పరిచాడు. అంత కష్టపడి పనిచేసిన కందస్వామి, అక్కడ నుండీ వెళ్ళిపోయి మరి తిరిగి రాలేదు. ఆయన పేరిటే ఆశ్రమాన్ని 'స్కందాశ్రమం' అని పిలవసాగారు. 'స్కంద' అనేది సంస్కృత శబ్దమైతే, 'కంద' అనేది తమిళ శబ్దం.

ప్రతి సంవత్సరం కనీసం ఒక్కసారి అయినా నన్ను తీసుకొని అలమేలు అత్తా, మామ పిచ్చు అయ్యర్, తిరువణ్ణామలై వచ్చి ఊళ్ళో వుండి, కొండ మీద వున్న స్కందాశ్రమానికి శ్రీభగవాన్ దర్శనానికి వచ్చేవారు. అపుడు నాకు నాలుగేళ్ళ వయస్సు. ఆశ్రమంలో ఆ కాలంలో జరిగిన అనేక సంఘటనలు నాకు స్పష్టంగా గుర్తున్నాయి. రాత్రిళ్ళు స్కందాశ్రమంలో కాషాయం ధరించిన నాయనమ్మ అలఘమ్మాళ్‌ను మినహాయించి, స్త్రీలను ఎవ్వరినీ వుండనిచ్చేవారు కాదు. కాబట్టి, రాత్రిళ్ళు నన్ను తీసుకొని అత్త, మామయ్య క్రిందకు వెళ్ళిపోయేవారు. ఒక్కోసారి మాత్రం, కిందకు నన్ను ఎత్తుకుని వెళ్ళలేక, ఆశ్రమంలో వదలి వేసేవారు. అలాంటపుడు శ్రీభగవాన్ నన్ను రాత్రిపూట తన పక్కనే వుంచుకునే వారు. ఎంతో ప్రేమతో పడుకున్న నాకు దుప్పటి కప్పేవారు. ఉదయం పూట నాకు పళ్ళు తోమి, స్నానం చేయించేవారు.

పగటి పూట శ్రీభగవాన్ ఒక బల్లమీద ఆసీనులై నన్ను తన పక్కనే కూర్చుండబెట్టుకొని, ఇంటి దగ్గర నేను చేసే అల్లరి గురించి అడిగేవారు. అత్త, మామయ్య కొండెక్కుతుంటే చూసి, 'అదిగో, మీ అత్త మామయ్య



వస్తున్నారు. ఇక నీ సంగతి వారు చూసుకుంటారు' అనేవారు. ఎపుడైనా, అత్త రావడం ఆలస్యమైతే నా సంగతి పెరుమాళ్‌స్వామిని చూసుకోమనే వారు.

పెరుమాళ్‌స్వామి ఆశ్రమంలో పని చేసేవారు. ఆ రోజుల్లో శ్రీభగవాన్ పరిచారకుడిగా వుండేవాడు. నన్ను ఎత్తుకెళ్ళి మామిడి చెట్టు దగ్గర దింపేవాడు. మామిడి కొమ్మలకు గట్టి తాళ్ళు కట్టి, ఒక బల్ల వేసి ఉయ్యాలలాగ చేసి, నన్ను ఊపేవాడు. భలే సరదాగా వుండేది. ఇదే పెరుమాళ్‌స్వామి, తర్వాత ఆశ్రమానికి ఎదురు తిరిగి చాలా ఇబ్బందులు కలగజేసాడు. ఆ సంగతులు తర్వాత తెలియ జేస్తాను.

ఒక్కోసారి నేను, అత్త, మామయ్య కొండ దిగుతున్నపుడు, ఆశ్రమానికి చెందిన నల్లకుక్క కరుప్పన్ మాతోపాటు వచ్చేది. మామూలుగా మేము పెద్దవీధిలో ఒక భక్తుడి ఇంట్లో వుండేవాళ్ళం. ఆరు బయట నేను, గట్టుమీద మామయ్య పడుకునేవారం. ఒకరోజు ఉదయం సూర్యోదయం కాకముందే కరుప్పన్ నా దగ్గరకు వచ్చి, నేను మాత్రమే లేచేటట్లు నెమ్మదిగా మొరిగింది. కొద్దిదూరం పరుగెత్తి, ఆగి, వెనుకకు తిరిగి చూసింది. తనతోపాటు నన్ను రమ్మంటోంది అనిపించి, తనతో పాటు వెళ్ళాను. కొండదగ్గరకు వెళ్ళి పైకెక్కి స్కందాశ్రమం వెళ్ళిపోయాం. మమ్మల్ని చూసి ఆశ్చర్య పోయిన శ్రీ భగవాన్ కుంజుస్వామిని పిలిచి, నేను కొండమీద ఆశ్రమంలో క్షేమంగా వున్నానని అత్తకు, మామయ్యకు చెప్పమని పంపించారు. ఇలాంటి సంఘటనలెన్నో నాకు స్మృతిపథంలో మెదులుతున్నాయి. నేనంటే శ్రీభగవాన్‌కు ఎంతో ప్రేమ అని నాకు తెలిసింది. కానీ, ఆయన గొప్ప తనం ఆ చిన్నవయస్సులో నాకు తెలియలేదు. *(సశేషం)*

## We Must Let Ourselves be Possessed by God

Dr.K.Subrahmanian (Talk 53)

We sometimes feel that even though we worship God, He does not give us the strength we need. But if we sincerely analyse ourselves, we will be conscious of the fact that we don't love God as much as we love the things of this world. If I am intensely aware of the fact that I don't love God the way I love the world, there is hope. We cry so much for our money, for our children, and so on, but who is it that cries for God? On the other hand, saints and sages cried for God, and they did not want anything else. To the extent that we think of God, to that extent we get relief. The moment I realize I am stupid, I become wise. Similarly, if I am utterly convinced that I really don't love God enough, then something remarkable happens. The realization that I am only making use of God for the comforts of the world, leads to greater awareness. This attitude is possible only through the grace of God. All the saints and sages have said, "Oh Lord! I don't think of you always. Even now my interest in worldly life is not gone." How much more should we say this!

We all want complete peace of mind, and at the same time,we are worried about our job, our family and about so many things. On such occasions, if we think, "Why should I worry? He knows what is good for me. My worrying is not going to change anything." When you have



